సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



రణస్థలంలో అభిమాన నేతకు జేజేలు పలుకుతున్న యువత



పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం



జగన్ విన్నారు.. చూశారు.. ఎంతో చేశారు!

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

చెప్పినవన్నీ చేశారు.. చెప్పనవి కూడా చేశారు. కిందటి ఎన్నికల ముందు అన్న మాటలన్నీ నిలబెట్టుకున్నారు. ఐదేళ్ల పాలనా కాలం ఓ జిల్లా దశదిశలను ఎలా మార్చగలదో చేసి చూపించారు. గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసి చూపించడం దగ్గర నుంచి.. జిల్లా జవజీవాలైన వ్యవసాయం, మత్స్యకార రంగాల పునాదులను బలోపేతం చేశారు. వేల కోట్ల రూపాయల సంక్షేమంతో ప్రజల జీవన ప్రమాణాలు సమూలంగా మార్చేశారు.


'నేను విన్నాను.. నేను ఉన్నాను '.. అంటూ ఊరూ వాడా తిరిగారు.. భరోసా ఇచ్చారు. కట్ చేస్తే.. ఐదేళ్లు గిర్రున తిరిగిపోయాయి. మళ్లీ ఆయన మనముందుకొస్తున్నారు. మరి ఆనాడు చెప్పినవన్నీ చేశారా? ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారా? దీనికి ప్రత్యేకంగా పనిగట్టుకుని ఎవరూ సమాధానం చెప్పక్కర్లేదు. ఆయన చేసిన అభివృద్ధి, జిల్లాలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న మార్పులే సమాధానం చెబుతాయి. అవును.. గత ఎన్నికల ముందు చెప్పినవి.. చెప్పనివి.. ఎన్నో చేసి చూపించారు వైఎస్ జగన్. వలసలకు అడ్డుకట్ట వేసి స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేలా దశాబ్దాల కల అయిన పోర్టుతో పాటు ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి తెస్తున్నారు. ఉద్దానం ఉసురు తీస్తున్న కిడ్నీ మహమ్మారి నుంచి రక్షించేందుకు రిసెర్చ్ ల్యాబ్, అత్యధునాతన ఆస్పత్రి నిర్మించారు. ఉద్దానం పల్లెలన్నింటికీ పరిశుద్ధమైన తాగునీటి పథకం ఏర్పాటు చేశారు. అగ్రి ల్యాబ్‌లు, భరోసా కేంద్రాలు, అధునాతన వైద్య సౌకర్యాలు, ఇంటికే ప్రభుత్వ పథకాలు, వేలాదిమందికి పక్కా ఇళ్లు.. వెరసి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గత ఏడున్నర దశాబ్దాల్లో జరగని అభివృద్ధిని కేవలం ఐదేళ్లలోనే చేసి చూపించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదే. వెనుకబడిన సిక్కోలు దశ దిశ మార్చిన ప్రియతమ నాయకుడు మళ్లీ తమ మధ్యకు వస్తుండటంతో ఆయనపై అపూర్వ రీతిలో అభిమానం కురిపించేందుకు, నభూతో.. అన్నట్లు స్వాగతం పలికి అక్కున చేర్చుకుని మద్దతు ప్రకటించేందుకు జిల్లా ప్రజానీకం వేయి కళ్లతో ఎదురుచూస్తోంది. చేసిన అభివృద్ధి చూసి ఓట్లు వేయండి.. అంటున్న జననేతపై మరోసారి ఓట్ల వర్షం కురిపించేందుకు సై అంటున్నారు.



సంక్షేమ రథం

- అభివృద్ధి బాటలో శ్రీకాకుళం జిల్లా
  - రూ.వేల కోట్లతో పనుల నిర్వహణ
  - రూ.15వేల కోట్లకు పైగా సంక్షేమ పథకాలు
  - నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు
- ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక ప్రాజెక్టులు మంజూరు
- పోర్టు, ఫిషింగ్ హార్బర్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులతో మారనున్న జీవన పరిస్థితులు
- వ్యవసాయం, పారిశ్రామిక, మత్స్యకార రంగాల్లో విశేష ప్రగతి
- కొత్త ప్రాజెక్టులతో జిల్లాకు మహర్దశ

ఇళ్లు కట్టి చూపారు..



జిల్లాలో లక్షా 10వేల 825మందికి ఉచితంగా ఇళ్ల స్థలాలు అందజేశారు. వాటిలో మొదటి విడతగా 83,456 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.

ఉద్దానానికి ఊపిరి



కాశీబుగ్గ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, వైఎస్సార్ సుజలధార. వైఎస్ జగన్ పాలనకు ఈ రెండు సజీవ సాక్ష్యాలు. శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం అన్నీ ఈ ఐదేళ్లలోనే జరిగాయి. రూ.85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, రూ.800 కోట్లతో వైఎస్సార్ సుజలధార నిర్మించి జిల్లాకు కానుకగా ఇచ్చారు.

ప్రగతి 'బాట'



- జిల్లాలో ఐదేళ్లలో ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో రూ.526.69కోట్లతో 633.4 కిలోమీటర్లకు సంబంధించి 432 రోడ్లు మంజూరు చేసింది. వాటి పనులు చేపట్టింది.
- పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఏఐఐబీ కింద రూ.352.78 కోట్లతో 484.43కిలోమీటర్ల మేర 312 రోడ్లు వేసేందుకు మంజూరు చేసింది. అదే స్కీమ్‌లో కొత్తగా రూ.46.72 కోట్లతో 205.68 కిలోమీటర్లతో 83 రహదారులు మంజూరు చేసింది.
- ప్రత్యేక మరమ్మతుల కింద 275 కిలోమీటర్ల పొడవునా రూ.73.25 కోట్లతో 54 రోడ్ల పనులు చేపట్టారు. ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు వర్క్స్ కింద రూ.350 కోట్లతో 480 కిలోమీటర్ల పొడవునా 312 పనులు చేపడుతున్నారు.
- నగరపాలక, పురపాలక సంఘాల్లో రూ.48 కోట్లతో రహదారులను అభివృద్ధి చేశారు.
- మరో రూ.300 కోట్లతో జిల్లాలో 12 భారీ వంతెనలు నిర్మించారు. బలసలరేవు బ్రిడ్జి నిర్మాణానికి రూ.87కోట్లు మంజూరు చేశారు.

అత్యాధునిక విద్య..



- ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో రూ.131కోట్లతో జీప్లస్-5 బ్లాక్ భవనాలు మూడు నిర్మించారు. న్యూ అకాడమీ బ్లాక్‌కు కూడా నిధులు మంజూరు చేశారు. మరో రూ.133 కోట్లతో 6వేల మందికి సరిపడా వసతి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రూ.45 కోట్లతో అదనపు భవనాలు నిర్మించారు.
- జిల్లాలకు కొత్తగా పలు డిగ్రీ కాలేజీలతో పాటు ఆమదాలవలస నియోజకవర్గంలో వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల, అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల, హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ మంజూరు చేశారు.

పల్లె చెంతకు వైద్యం..



- విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ విధానాలతో పల్లెకు వైద్యం చేరువ చేశారు.
- జిల్లాలో కొత్తగా రూరల్ ప్రాంతాల్లో 5 పీహెచ్‌సీలు, శ్రీకాకుళం, ఆమదాలవలస తదితర అర్బన్ ప్రాంతాల్లో 11 పీహెచ్‌సీలను కొత్తగా ఈ ప్రభుత్వ హయాంలోనే నిర్మించారు. పాతపట్నంలో 50 పడకల సామాజిక ఆస్పత్రిని రూ.4.2 కోట్లు, జొన్నవలస ఆస్పత్రిని 2.45 కోట్లు, లావేరులో రూ.1.20 కోట్లు, సోంపేట సామాజిక ఆస్పత్రిని రూ.4.60 కోట్లు, బారువ సామాజిక ఆస్పత్రిని రూ. 5.60 కోట్లతో అభివృద్ధి చేశారు.
- నాడు–నేడు కింద 83 ఆస్పత్రులను రూ.47 కోట్లతో అభివృద్ధి చేశారు. నరసన్నపేట ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు.

జలయజ్ఞం..ఫలప్రదం

జిల్లా దశాబ్దాలుగా కలలు కంటున్న నేరడిపై వైఎస్ జగన్ కీలక అడుగులు వేశారు. ఒడిశా సీఎంతోనూ మంతనాలు జరిపారు. ఈ లోగా మంత్రి ధర్మాన సూచనతో గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించి వంశధార రిజర్వాయర్‌ను నింపేందుకు ఆలోచన చేశారు. దీని కోసం రూ.176.35 కోట్లు మంజూరు చేయడమే కాకుండా పనులు కూడా ప్రారంభించారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.852 కోట్లు మంజూరు చేశారు. మడ్డువలస రెండో దశ పనులకు రూ.26.65 కోట్లు మంజూరు చేశారు.

పల్లెకు కొత్తరూపు..

జిల్లాలో రూ.262 కోట్లతో 654 సచివాలయాలు నిర్మించారు. రూ.93.62 కోట్లతో 535 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ కట్టారు. 642 రైతుభరోసా కేంద్రాలు, 7 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల నిర్మాణాలు చేపట్టారు.

మనబడి నాడు-నేడు

ఫేజ్–1లో రూ.286.22 కోట్లతో 1247 పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఫేజ్–2లో రూ.427.73 కోట్లతో 1096 విద్యాసంస్థలను తీర్చిదిద్దారు.

సామాన్యులకు సర్కారు చేసిన సాయం..

నియోజకవర్గం	డీబీటీ రూ. కోట్లలో..	నాన్ డీబీటీ రూ. కోట్లలో
ఆమదాలవలస	1259.47	650
నరసన్నపేట	1340.52	500
శ్రీకాకుళం	1534.15	500
టెక్కలి	1507.06	400
పలాస	1301.72	600
ఇచ్ఛాపురం	1590.05	727
ఎచ్చెర్ల	1669.93	369.35
పాతపట్నం	1307.40	820

(గత డిసెంబర్ వరకు)



జిల్లాకు స'పోర్టు'

భావనపాడు పోర్టు జిల్లా అరవై ఏళ్ల కల. మూలపేట పోర్టు పేరుతో ఆ స్వప్నాన్ని సాకారం చేశారు. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.4361.91 కోట్లతో మూలపేట పోర్టు నిర్మిస్తున్నారు. మత్స్యకారుల కోసం రూ.365.81కోట్లతో ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో రూ.11.95 కోట్లతో జెట్టీ నిర్మిస్తున్నారు.

అభిమాన నేతకు అపూరూప స్వాగతం

జాతీయ రహదారిపై జనజాతర జరిగింది. అభిమాన నేతకు ఆత్మీయ గణం అపురూపంగా స్వాగతం పలికింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర జిల్లాకు చేరుకుంది. రణస్థలంలోకి ఆయన కాన్వాయ్ ప్రవేశించగానే దారులన్నీ హోరెత్తిపోయాయి. అప్పటివరకు అక్కడే నిరీక్షించి ఉన్న అభిమానులు ముఖ్యమంత్రిని చూడగానే కేరింతలు కొట్టారు. సీఎం కూడా ఆనందంగా అభివాదం చేస్తూ అందరినీ సంతోషపరిచారు. నేడు టెక్కలి సభతో ఈ యాత్ర పూర్తి కానుంది.



బస్సులో నుంచి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్, పక్కనే ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్

- జిల్లాలోకి ప్రవేశించిన సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం బస్సుయాత్ర
- రణస్థలంలో పోటెత్తిన జనం
- కిక్కిరిసిపోయిన జాతీయ రహదారి

సాక్షి ప్రతినిధి,శ్రీకాకుళం:ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్ర మంగళవారం రాత్రి జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ శ్రేణులు అపురూప రీతిలో స్వాగతం పలికాయి. బస్సు యాత్ర రణస్థలం చేరుకోగానే జగన్నినాదం హోరెత్తింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనంతో జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. భారీగా తరలివచ్చిన మహిళలు విజయ హారతులు పట్టి స్వాగతం పలికారు. విజయనగరం జిల్లా యాత్ర ముగించుకుని రాత్రి 8 గంటల సమయంలో ముఖ్యమంత్రి బస్సు యాత్ర జిల్లాలోకి చేరడంతో రణస్థలం జనసంద్రమైంది. అభిమాన నేత కోసం బారులు తీరిన ప్రజలు బస్సు వెంట పరుగులు తీశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పైకి వచ్చి అభివాదం చేశారు. సీఎం వచ్చేసరికి జనసందోహంతో బుడుమూరు జంక్షన్ నిండిపోయింది. తన కోసం ఎదురు చూసిన ప్రజలను చూసి జగన్ బస్సులో నుంచే అభివాదం చేస్తూ చిరునవ్వుతో సంతోషం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి రాత్రి బస చేసే అక్కివలసకు చేరుకుంది. అక్కడ వేచి ఉన్న జనం బ్రహ్మరథం పట్టారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి

నేతల స్వాగతం

విజయనగరం పర్యటన ముగించుకుని రణస్థలం చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌కు జిల్లా నేతలు ఎదురెళ్లి స్వాగతం పలికారు. అప్పటికే బస్సులో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రీజినల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, బడ్డు కొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ఉండగా అక్కడ జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు జాయిన్ అయ్యారు. బస చేసిన అక్కివలస వద్ద మంత్రి ధర్మాన ప్రసాదరావు, మెంటాడ స్వరూప్ సీఎం జగన్‌కు స్వాగతం పలికారు.



అక్కవరం వద్ద మేమంతా సిద్ధం సభా వేదిక

నేడు జిల్లాలో బస్సు యాత్ర, టెక్కలిలో బహిరంగ సభ

బుధవారంతో మేమంతా సిద్ధం బస్సు ముగియనుంది. రాత్రి బస చేసిన అక్కివలస నుంచి 22వ రోజు బస్సు యాత్ర ప్రారంభం కానుంది. ఉదయం 9 గంటలకు అక్కివలస నుంచి బయల్దేరుతారు. అక్కడి నుంచి చిలకపాలెం, ఎచ్చెర్ల బైపాస్, శ్రీకాకుళం బైపాస్, సింగుపురం, కోమర్తి, మడపాం, నరసన్నపేట బైపాస్, వాంగ్రాడ, కోటబొమ్మాళి, కన్నెవలస మీదుగా పరశురాంపురం జంక్షన్ వద్దకు చేరుకుంటారు. అక్కడ భోజన విరామం ఉంటుంది. అనంతరం కె.కొత్తూరు మీదుగా సాయంత్రం 3 గంటల సమయంలో టెక్కలి సమీపంలోని అక్కవరం వద్ద బహిరంగ సభలో పాల్గొంటారు. బహిరంగ సభ అనంతరం బస్సు యాత్ర ముగియనుంది. సాయంత్రం 5.30గంటలకు అక్కవరం నుంచి హెలికాప్టర్‌లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు బయల్దేరుతారు.

క్లుప్తంగా

మంగళవారం 29 నామినేషన్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికలు–2024కు సంబంధించి మంగళవారం 29 నామినేషన్లు దాఖలయ్యాయి. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి ఇప్పిలి సీతరాజు(జైభారత్ నేషనల్ పార్టీ), చెల్లూరి డానియల్(ఇండిపెండెంట్–2 సెట్లు), సనపల శ్రావణకుమార్(ఇండిపెండెంట్), పేరాడ తిలక్(వైఎస్సార్‌సీపీ) నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఇచ్ఛాపురంలో వేదవర బిసాయి(బీఎస్పీ), పలాసలో పోతనాపల్లి కామేశ్వరరావు సీపీఐ(ఎంఎల్)–2 సెట్లు, టెక్కలిలో చింతాడ శ్రీనివాసరావు(బీఎస్పీ), కింజరాపు విజయమాధవి(టీడీపీ), కింజరాపు అచ్చెన్నాయుడు(టీడీపీ), పాతపట్నంలో రాజాన మోహనరావు(ఇండిపెండెంట్–2 సెట్లు), కొప్పురైతు వెంకటరావు(కాంగ్రెస్), గొల్ల తిరుపతిరావు(జై భారత్ నేషనల్ పార్టీ–2 సెట్లు), బగ్గు కృష్ణ(ఇండిపెండెంట్), జన్ని సంజీవరావు(గోండ్వానా దండకారణ్య పార్టీ), శ్రీకాకుళంలో కర్రి లక్ష్మణ(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), ఆమదాలవలసలో కూన రవికుమార్(టీడీపీ–2 సెట్లు), కూన ప్రమీల (ఇండిపెండెంట్), ముద్దాడ మధుసూదనరావు(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), సనపల సురేష్‌కుమార్(ఇండిపెండెంట్), ఎచ్చెర్లలో గొర్లె కిరణ్‌కుమార్(ఇండిపెండెంట్), సువ్వారు రమ్య(ఇండిపెండెంట్–2సెట్లు), నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్(వైఎస్సార్ సీపీ), కాయ కామేశ్వరి(నవరంగ్ కాంగ్రెస్ పార్టీ) నామినేషన్లు దాఖలు చేశారు.

రామకృష్ణకు ఎక్స్‌లెన్స్ అవార్డు



రామకృష్ణను అభినందిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.రామకృష్ణ భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును బోధన రంగంలో అందించిన సేవలకుగాను అందజేశారు. పరిశోధన పత్రం, పరిశోధనల ఆధారంగా అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వర్సిటీలో మంగళవారం రామకృష్ణను వీసీ కె.ఆర్.రజిని అభినందించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

సారవకోట: మండలంలోని కూర్మనాథపురం పంచాయతీ బంజీరుపేటలో మెట్ట కస్తూరికి చెందిన ఇల్లు మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. వీఆర్వో అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. కస్తూరి మంగళవారం పాతపట్నం మండలం మెట్టపేట గ్రామానికి వివాహ వేడుకకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో వస్తువులు, ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు, అర తులం బంగారం కాలిపోయింది. స్థానికులు గుర్తించి మంటలు అదుపు చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి చేశారు.

అంబులెన్స్ ఢీకొని ఇద్దరి మృతి

అల్లిపురం: అంబులెన్స్ ఢీ కొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మహారాణిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన లూకలపు రామకృష్ణ (19), తన స్నేహితుడు చందు (20)తో కలసి ఈ నెల 22వ తెల్లవారుజామున బైక్‌పై సూర్యాభాగ్, వెంకటేశ్వర థియేటర్ మీదుగా జీవీఎంసీ జోనల్ కార్యాలయం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో లీలామహల్ పెట్రోల్ బంకు నుంచి జగదాంబ వైపు వస్తున్న 108 అంబులెన్స్ డ్రైవర్ ఎస్.ఈశ్వరరావు బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి ఇద్దరూ కింద పడి.. తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను వెంటనే ఆటోలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు. రామకృష్ణ బాబాయి లూకలపు తవుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రామకృష్ణ తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో.. ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చంటి తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తల్లి విజయవాడలో ఉంటోంది. చంటి కూడా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ బతుకుతున్నాడు. చంటి తల్లి నిరుపేద కావడంతో ఆమె విజయవాడ నుంచి విశాఖ రావడానికి పోలీసులు ఆర్థిక సాయం చేశారు. దీంతో ఆమె మంగళవారం విశాఖ వచ్చారు. మృతదేహాలకు మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: మండలంలోని వెంకటాపురం సచివాలయం పరిధిలోని హడ్డివాడ గిరిజన గ్రామంలో బెల్లం ఊట ధ్వంసం చేశారు. టెక్కలి సీఐ రాజశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సంయుక్తంగా మంగళవారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం ఎస్ఈబీ జేడీ గంగాధరం ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. 1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేయగా.. 80 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



సీం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఎం.వి.స్వరూప్ తదితరులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్ర శ్రీకాకుళం జిల్లాలోకి ప్రవేశించింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పైడి భీమవరం నుంచి అరిణాం అక్కివలస వరకూ మంగళవారం రాత్రి బస్సుయాత్ర సాగింది. ఈ సందర్భంగా జగనన్నను చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు.

–ఎచ్చెర్ల /ఎచ్చెర్ల క్యాంపస్ /రణస్థలం/జి.సిగడాం

కుటుంబానికి మేలు



సీఎం జగన్ మా ప్రాంతానికి వస్తున్నారని తెలిసి చూడటానికి వచ్చాను. ఆయన వల్ల మా కుటుంబం చాలా బాగుపడింది. మళ్లీ జగనే సీఎం అవుతారనే నమ్మకముంది.

– నాగవరపు లక్ష్మణరావు, ఎర్రవరం

జగన్‌బాబును చూద్దామని..



జగన్‌బాబు వస్తున్నాడని చేపల వ్యాపారం వదిలి చూడటానికి వచ్చాను. ఆయన దయవల్లే చిరువ్యాపారం ఏర్పాటుకు రుణం వచ్చింది. రణస్థలంలోనే వ్యాపారం చేసుకుంటున్నాం. – మహంతి పైడినాయుడు, రణస్థలం

ఆయన చలవే..



జగన్ సీఎం అయ్యాక రూ.3 వేల పింఛన్ వస్తోంది. ఆయన చలవ వల్లే మూడు పూట్లా అన్నం తింటున్నాం. జగన్‌ను చూడటం చాలా సంతోషంగా ఉంది.

– కిల్లారి చిన్నసత్యం, లంకపేట

మళ్లీ గెలిపిస్తాం



ప్రతిపక్షాలు ఎన్ని కూటములుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం. ఆయనంటే మా అందరికీ చాలా అభిమానం. అందుకే మా ప్రాంతం నుంచి తండోపతండాలుగా చూసేందుకు వచ్చాం.

– పొదుగు మల్లేశ్వరరావు, మహంతిపాలెం

ఆయన మాటలు విందామని..



నాకు కళ్లు సరిగ్గా కనిపించకపోయినా సీఎం జగన్ మాటలు విందామని వచ్చాను. గత ప్రభుత్వాల హయాంలో పింఛన్ రాలేదు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకే నాకు పింఛన్ వస్తోంది. – బొజ్జ సుందరరావు, బుడుమూరు


నిరుద్యోగులకు బాసటగా..



జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వలంటీరుగా పనిచేసే అవకాశం దక్కింది. నాలాంటి నిరుద్యోగులకు ఎంతో బాసటగా నిలిచారు. ఆయనే పాలనలో ప్రజలకు మంచి జరిగింది. – కుమారి, వలంటీర్, బుడుమూరు

బాబుకో దండం.. టీడీపీలో ఉండం!

- శ్రీకాకుళం నియోజకవర్గంలో ఖాళీ అవుతున్న తెలుగుదేశం పార్టీ
- ఎన్నేళ్లు పనిచేసనా గుర్తింపు లేదంటూ నాయకుల ఆవేదన
- వైఎస్సార్‌సీపీలోకి రోజురోజుకూ పెరుగుతున్న చేరికలు
- తాజాగా గార మాజీ ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు చేరిక



మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన గార మాజీ ఎంపీపీ, టీడీపీ నేత పుల్లటి నాగేశ్వరరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జల్లు రాజీవ్, మిగతా మండల కార్యవర్గం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : శ్రీకాకుళంలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతోంది. ఆ పార్టీకి కీలక నాయకులు గుడ్‌బై చెప్పేస్తున్నారు. ఎన్నాళ్లైనా పార్టీలో గుర్తింపు లేదని, ఎమ్మెల్యే టికెట్‌ను కోట్లాది రూపాయలకు అమ్ముకుని, పార్టీ కోసం పనిచేసిన వారికి మొండిచేయి చూపిందన్న ఆవేదనతో టీడీపీకి దండం పెట్టేస్తున్నారు. ఇలాంటి పార్టీలో కొనసాగలేమంటూ ఝలక్ ఇస్తున్నారు. ప్రతి రోజూ అటు నగరంలోనూ, ఇటు శ్రీకాకుళం రూరల్, గారలో వందలాది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉంటామని, విజన్ ఉన్న ధర్మాన ప్రసాదరావు నాయకత్వంలో కలిసి నడుస్తామంటూ ఇప్పటికే వేలాదిగా వైఎస్సార్‌సీపీలోకి వచ్చేశారు. తాజాగా గార మండలంలో టీడీపీ మాజీ ఎంపీపీ పుల్లటి నాగేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు జల్లు రాజీవ్‌తో పాటు మండల కార్యవర్గమంతా వైఎస్సార్‌సీపీలో చేరిపోయింది.

ఎంత నచ్చజెప్పినా..

నియోజకవర్గంలో ప్రతి రోజూ వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరుగుతున్నాయి. దీంతో టీడీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఎంత నచ్చచెప్పినా, ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా వైఎస్సార్‌సీపీలోకి వెళ్తున్న వారిని ఆపలేకపోతున్నామని తలలు పట్టుకుంటున్న పరిస్థితి నెలకొది. ఖాళీ అయిపోతున్న పార్టీని చూసి నాయకత్వం చేష్టలుడిగి చూస్తోంది. పార్టీకి ఎందుకింత పరిస్థితి వచ్చిందని మదనపడుతోంది. రోజురోజుకూ పార్టీ బలహీనపడుతుండటంతో ఎన్నికలకు ముందే చేతులెత్తేస్తున్న దుస్థితి చోటుచేసుకుంది. నియోజకవర్గంలో ఎక్కడా చూసినా వైఎస్సార్‌సీపీలో చేరికల సందడే కన్పిస్తోంది. ఒక్క మంగళవారం తీసుకుంటే గార మండలంలోని టీడీపీ మాజీ ఎంపీపీ పుల్లటి నాగేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు జల్లు రాజీవ్‌తో పాటు కీలక నాయకులంతా మంత్రి ధర్మాన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. జల్లువలస, బందరువానిపేట తదితర గ్రామాల నుంచి 200 మందికి పైగా టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పెదపాడులో కలగ గణేష్‌కుమార్, వాన శ్రీరాములు, వాన అప్పలరాజు, వాన మహేష్, వాన అప్పారావు, తదితర కీలక వ్యక్తులు వైఎస్సార్‌సీపీలోకి వచ్చేశారు. ఇక, అరసవిల్లి ప్రాంతంలో కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులు పెద్ద ఎత్తున ధర్మాన ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన అరసవిల్లి కొత్త ఓటర్లు



వైఎస్సార్‌సీపీలో చేరిన పెదపాడు కీలక నాయకులు

జిల్లాకు చంద్రబాబు చేసింది శూన్యం



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లాపై ఎక్కడలేని ప్రేమ వలకబోస్తున్న చంద్రబాబుకు ఒక్కటే అడుగుతున్నామని.. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన మీరు జిల్లాలో మీ మార్కు అభివృద్ధి పని ఒక్కటైనా చూపించాలని పలాస వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సవాల్ విసిరారు. పలాసలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వెనుకబడి ఉందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవని ఇటీవల చంద్రబాబు మాట్లాడుతున్నారని, మరి పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. తొక్కతీస్తాను, తోలు తీస్తాననే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. తండ్రి వైఎస్సార్, తనయుడు జగన్ జిల్లాలో ఆఫ్‌షోర్ ప్రాజెక్టు, గొట్టాబ్యారేజీ లిఫ్ట్ ఇరిగేషన్, వంశధార ప్రాజెక్టు ఫేజ్–01, ఫేజ్–02, వంశధార శివారు ప్రాంతాలకు సాగునీరు, రిమ్స్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, యువజన కేంద్రాలు, పలాసలో కిడ్నీ ఆసుపత్రి, మూలపేట పోర్టు వంటి పనులు చేపట్టారని వివరించారు. బుధవారం టెక్కలిలో నిర్వహించే జగనన్న సిద్ధం సభకు పలాస నియోజకవర్గం నుంచి పాతికవేల మంది కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

మేమంతా సిద్ధం సభకు తరలిరండి



పేరాడ తిలక్, ఎంపీ అభ్యర్థి

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ముగింపు సభ బుధవారం టెక్కలిలో నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ రహదారికి ఆనుకుని టెక్కలి సమీపంలో అక్కవరం వద్ద సాయంత్రం నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం టెక్కలిలో నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కోరారు. సభా ప్రాంగణం ఏర్పాట్లు వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రను ఎంతో ప్రతిష్టాత్మకంగా టెక్కలిలో ముగిస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టెక్కలిలో నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర కార్యక్రమానికి మహిళలంతా అత్యధికంగా తరలిరావాలని పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు కోరారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన ప్రతీ సంక్షేమ పథకానికి మహిళలను యజమానులుగా చేశారని, దీనికి మహిళలు రుణం తీర్చుకోవాలని కోరారు.



అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పేదల ఆశాజ్యోతి సీఎం జగన్ మోహనరెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేద్దామని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీ ఇంటికి మంచి జరిగితేనే ఓటు వేయండని అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పవన్ పర్యటించి ఏమీ చేయలేకపోయారని, సీఎం జగనన్న మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రిసెర్చ్ సెంటర్ వంటివి ఈ ప్రాంత ప్రజలకు అందించారని గుర్తు చేశారు.

ముగిసిన ఆదిత్యుని కల్యాణోత్సవాలు



అనివెట్టి మండపంలో పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

- ఘనంగా చక్రతీర్థ స్నానాలు, పుష్పయాగం

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా చివరి రోజు రాత్రి పుష్పయాగం, ఏకాంతసేవలు ఘనంగా నిర్వహించారు. చైత్ర శుద్ధ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆలయ ఇంద్రపుష్కరిణి ఆవరణలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో కల్యాణమూర్తులకు సుమంగళి అర్చన, నీలమణి ధారణ, నాకబలి ప్రయుక్త చక్ర తీర్థ స్నానాలను చేయించారు. అనంతరం వేదమంత్రాలు, మంగళధ్వనుల మధ్య ఆలయంలోకి కల్యాణమూర్తులను తీసుకొచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కల్యాణోత్సవాలను ముగిస్తూ ధ్వజావరోహణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవో ఎస్.చంద్రశేఖర్, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



చక్రతీర్థ స్నానాల తర్వాత స్వామివారి మూర్తులను తీసుకొస్తున్న శంకరశర్మ బృందం

వైభవంగా పుష్పయాగం..

ముగింపు ప్రక్రియలో భాగంగా స్వామివారి పుష్పయాగ మహోత్సవం అనివెట్టి మండపంలో నిర్వహించారు. సుమారు 12 రకాల పుష్పాలతో స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో కూడిన ఏకాంతసేవ ఘనంగా నిర్వహించారు.

విశ్వశాంతి విద్యార్థుల సత్తా



ఆర్.సందీప్–594



సి.హెచ్.దేవీశ్రీ దిలీప్–591



మెట్ట సత్యశ్రీ–590



ఎస్.సాయికుమార్–590

పోలాకి: పదో తరగతి పరీక్షల్లో పోలాకిలోని విశ్వశాంతి స్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. ఆర్.సందీప్–594, సి.హెచ్.దేవీశ్రీ దిలీప్–591, మెట్ట సత్యశ్రీ–590, ఎస్.సాయికుమార్–590 మార్కులతో సత్తాచాటారని స్కూల్ డైరెక్టర్ మెట్ట జనార్దనరావు తెలిపారు. 150 మందికి 150 పాసయ్యారన్నారు. 590 మార్కులకు పైబడినవారు నలుగురు, 580 మార్కులకు పైబడినవారు 18 మంది, 570 మార్కులకు పైబడినవారు 29 మంది, 500 మార్కులకు పైబడిన వారు 108 మంది ఉన్నారన్నారు. విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు వడగాడ్పులకు అవకాశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వేసవి ప్రభావంతో బుధవారం జిల్లాలో వేడిగాలులు వీస్తాయని, వడగాడ్పులు అధికంగా వచ్చే ప్రమాదం ఉందని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు.